
సాక్షి
వనపర్తి
సోమవారం । 17 । జూలై । 2023



కోయిల్‌సాగర్‌పై ఆశలు
జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు సాగునీటి విడుదలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

వివరాలు 8లో ▸



విజయవంతం చేద్దాం..
పాత పింఛన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేద్దామని స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు.

వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /22.3
ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

108 సర్వీసెస్‌లో ఉద్యోగ అవకాశాలు

వనపర్తి: డ్రైవర్, ఈఎంటీలుగా 108, 102 సర్వీసెస్‌లో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు ప్రోగ్రాం మేనేజర్ రవికుమ్మరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 18న స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతాయన్నారు. డ్రైవర్ ఉద్యోగం కోసం పదో తరగతి ఉత్తీర్ణత, డ్రైవింగ్ లైసెన్స్ బ్యాడ్జి ఉండాలన్నారు. ఈఎంటీ కోసం బీఎస్సీ, నర్సింగ్, జీఎన్‌ఎం, బీ ఫార్మసీ, డి- ఫార్మసీ, డీఎంఎల్‌టీ అర్హత ఉండాలని వివరించారు.

ప్రత్యామ్నాయం చూపించాలని నిరసన



వనపర్తి: ప్రస్తుతం నెలకొన్న దుర్భిక్ష పరిస్థితుల్లో వ్యవసాయం చేసుకునేందుకు రైతులకు ప్రత్యామ్నాయం చూపించాలని ఆదివారం జిల్లా కేంద్రంలో రైతులు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య హాజరై మాట్లాడారు. సాదా బైనామాలను పరిష్కరించాలని, దరఖాస్తు చేసుకున్న పోడు రైతులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్భాటంగా పోడుభూములకు పట్టాలిస్తామని కేవలం 4 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చి మిగతా దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారన్నారు. సాదా బైనామాలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13 లక్షలకు పైగా దరఖాస్తులు వస్తే.. 20 శాతం కూడా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల మేర ఉన్న కౌలు రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రైతు ఆత్మహత్యల్లో ఎక్కువగా కౌలురైతులే ఉన్నారన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని, కౌలు రైతులను గుర్తించి, బ్యాంకు రుణాలు, రైతుబంధు, రైతుబీమా వర్తింపజేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గోపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యరెడ్డి, రామకృష్ణ, పోడు భూముల మహిళ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష సాయం సగరులందరికీ ఇవ్వాలి



వనపర్తిటౌన్: కుల వృత్తులకు ఇచ్చే రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తు చేసుకున్న సగరులందరికీ ఇవ్వాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సగర డిమాండ్ చేశారు. వనపర్తి సగర సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సగర జాతి వెనుకబడటంతోనే ప్రభుత్వ పథకాలు ఏ మాత్రం అందడం లేదన్నారు. బీసీ డీ లోని సగరులను బీసీ 'ఏ' లో చేర్చడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. వనపర్తిలో అధిక సంఖ్యలోని సగరులకు రాజకీయ అవకాశాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య మాట్లాడుతూ.. రూ.లక్ష సాయం సగరులు పొందేలా తగిన ప్రణాళికతో ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం, స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్‌బీ ఆంజనేయులు, సత్యం, మహేశ్వరి, విష్ణు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పాన్‌గల్: మండలంలోని మంగళ్లపల్లి (నిజామాబాద్)లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ చక్రపాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న వారు, ఎస్సీ కేటగిరికి చెందిన వ్యక్తులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్‌ను సంప్రదించాలన్నారు.

అమాత్యా.. నీదయ



ప్రారంభానికి సిద్ధమైన టౌన్‌హాల్

- ప్రారంభానికి నోచుకోని నాలుగు ప్రభుత్వ భవనాలు
- పనులు పూర్తి చేసుకుని రెండు నెలలుగా నాన్చుడు ధోరణి
- ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రారంభోత్సవాలకు అవకాశం



పనులు పూర్తయిన సమీకృత మార్కెట్ భవనం

వనపర్తి: రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించాలని జిల్లా కేంద్రంలో రూ.కోట్ల ప్రజాధనంతో నాలుగు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా.. వినియోగంలోకి రావటం లేదు. భవనాలకు రంగులు అద్దటంతో పాటు, ఆవరణలో నాటిన మొక్కలు సైతం పెద్దగా అవుతున్నా.. మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనకు ముహూర్తం ఖరారు కావటం లేదు. వేచిచూడలేక ఇటీవల నూతన ఎస్పీ కార్యాలయాన్ని హోంశాఖ మంత్రితో చేయించారు. అయినా.. మరో నాలుగు భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.

- ఈ జాబితాలో రూ.19.50 కోట్లతో నిర్మాణం చేసిన సమీకృత మార్కెట్ భవనం, రూ.5.75 కోట్లతో నిర్మాణం చేసిన టౌన్‌హాల్, రూ.3 కోట్లతో నిర్మాణం చేసిన ఆర్‌అంబీ గెస్ట్‌హౌస్, రూ.50 లక్షలతో నిర్మాణం చేసిన జంతు జనన నియంత్రణ కేంద్రాలు ఉన్నాయి. వీటి ప్రారంభోత్సవంతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు ఇదివరకే ప్రణాళిక సిద్ధం చేసుకున్నా.. జిల్లా పర్యటన విషయంలో ఇప్పటికే రెండుమార్లు ప్రాథమికంగా నిర్ణయమైన పర్యటన షెడ్యూల్ రద్దయ్యింది.

కూరగాయల విక్రయాలకు చెక్..

ఆకు, కూరగాయలు, మాంసం, చికెన్, చేపలతో పాటు ఇతర నిత్యావసర వస్తువులు ఒకేచోట లభించేలా పాత మార్కెట్ యార్డు భవనంలో అన్ని సౌకర్యాలతో కూడిన భవనం నిర్మాణం చేశారు. ప్రారంభోత్సవం తర్వాత రోడ్లపై ఆకు, కూరగాయలు, చేపల విక్రయాలను పూర్తిగా బంద్ చేయించి సమీకృత మార్కెట్ యార్డులో నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేశారు.

అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేలా..

ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రైవేటు పంక్షన్ హాల్స్‌ను ఆశ్రయించాల్సి వచ్చేది. అన్ని రకాల సౌకర్యాలతో నిర్మాణం చేసిన టౌన్‌హాల్ ప్రారంభోత్సవం చేస్తే.. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించేందుకు వెసులుబాటు లభిస్తుంది. ఆధునిక హంగులతో టౌన్‌హాల్ నిర్మాణం చేపట్టారు.

గెస్ట్‌హౌస్‌లో ఫర్నీచర్‌కు నిధుల సమస్య..

పుష్కర కాలంగా స్థలం వివాదం, నిధుల విడుదల తదితర సమస్యలతో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణం పుష్కర కాలంగా ఆగుతూ.. సాగుతూ.. అన్నట్లు ఎట్టకేలకు మూడు నెలల కిందట పనులు పూర్తిచేశారు. 2009లో మంజూరైన ఈ గెస్ట్ హౌస్ నిర్మాణం ఎస్టిమేషన్‌లో కేవలం భవన నిర్మాణమే ఉండటం, ఫర్నీచర్ లేకపోవటంతో ఆర్‌అండ్‌బీ అధికారులు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటికి నిధులు ఇస్తారా.. ప్రభుత్వ అనుమతి కోసం వేచిచూస్తారా అనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది. ఏదిఏమైనా.. ప్రస్తుతం జిల్లా కేంద్రానికి ఎవరైన వీవీపీలు వచ్చినా ఉండేందుకు కనీసం ఒక్క గెస్ట్‌హౌస్ కూడా లేదు.

త్వరలో ప్రారంభోత్సవం..



టౌన్‌హాల్, సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవాలు త్వరలో నిర్వహించేందుకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో అనుమతి తీసుకుంటాం. నెల రోజుల కిందటే షెడ్యూల్ నిర్ణయమై మళ్లీ రద్దైంది. అతి త్వరలో తేదీ ఖరారు చేస్తాం.
– మల్లయ్య, ఈఈ పంచాయతీరాజ్, వనపర్తి

కాంగ్రెస్‌లో టికెట్ల పోరు



కొల్లాపూర్ సభలో మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

- నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో కొత్త పంచాయితీ
- మాజీ మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల పార్టీలో చేరకముందే ముదురుతున్న గలాటా
- ఎవరికి వారుగా బలప్రదర్శనకు సమాయత్తం
- గెలుపులను సైతం అడ్డుకుంటామని సంకేతాలు
- తాజా పరిణామాలతో కేడర్‌లో గందరగోళం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సీనియర్ నేతలు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనుండటంతో ఆ పార్టీలో జోష్ కనిపిస్తుండగా.. మరోవైపు వారి చేరికకు ముందే చోటుచేసుకుంటున్న పరిణామాలు పార్టీ శ్రేణులను గందరగోళంలో పడేస్తున్నాయి. త్వరలో ఇరువురు నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న నేపథ్యంలో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలుగా ఉన్నవారు వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్‌లో అంతర్గత పోరు తప్పదన్న సంకేతాలను చూపుతోంది. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలు ఎవరికి వారు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. త్వరలో కొల్లాపూర్ వేదికగా నిర్వహించేందుకు తలపెట్టిన 'పాలమూరు ప్రజాభేరి' బహిరంగ సభ ఏర్పాట్లను సైతం ఇరువర్గాలుగా నేతలు తమ బలప్రదర్శనను చాటేందుకు సిద్ధమవుతున్నారు.

కొత్త, పాత నేతలు సర్దుకుంటారా..

కాంగ్రెస్‌లోకి మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు చేరిక నేపథ్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఈసారి పార్టీ టికెట్ కోసం అంతర్గత పోరు తప్పేలా కనిపించడం లేదు. త్వరలో జూపల్లి కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకు సన్నద్ధం అవుతుండగా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ నేత చింతలపల్లి జగదీశ్వర్‌రావు భారీ ర్యాలీతో బలప్రదర్శన చేపట్టారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వచ్చే ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏళ్లుగా నియోజకవర్గంలో పార్టీని పటిష్ఠం చేసేందుకు కృషి చేశానని, భారీ బహిరంగ సభల నిర్వహణ, పార్టీ సభ్యత్వాలను పెంచి పార్టీ బలాన్ని పెంచానని చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకుండా మోసం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో తాను పోటీలో ఉండటం ఖాయమని ప్రకటించడంతో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న జూపల్లికి పార్టీలో అంతర్గత పోరు ఖాయంగా కనిపిస్తోంది. ఎన్నికలకు నెలలు మాత్రమే సమయం మిగిలి ఉన్న తరుణంలో ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళన కేడర్‌లో నెలకొంది.

సర్వేల చుట్టూ రాజకీయాలు..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన కుమారుడు రాజేశ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం కాగా.. వచ్చే ఎన్నికల్లో వీరు కాంగ్రెస్ నుంచి టికెట్‌ను ఆశిస్తున్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో తాను బరిలో ఉంటానని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి చెబుతున్నారు. పార్టీలో అంతర్గత పోరును కట్టడి చేసేందుకు సర్వేల ద్వారా టికెట్లను ఖరారు చేస్తామని పార్టీ పెద్దలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే నియోజకవర్గాల్లో సర్వే మొదలైందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే సర్వేలతో పనిలేకుండా ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి అవకాశం ఇవ్వాలని నాగం జనార్దన్‌రెడ్డి, జగదీశ్వర్‌రావులు డిమాండ్ చేస్తున్నారు.

సమీకరణాలపై ఉత్కంఠ..

రాష్ట్రవ్యాప్తంగా పార్టీలోకి నేతల చేరికలతోపాటు పాలమూరు జిల్లాలో దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న నాయకుల చేరికలతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అయితే వారి చేరికకు ముందే కొత్త, పాత నేతల మధ్య వైరం పెరుగుతుండటం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది. ఆదివారం కొల్లాపూర్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన నాగం జనార్దన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో తమకు టికెట్ దక్కకుండా చేస్తే వారిని ఓడిస్తామనే సంకేతాలు ఇచ్చారు. అవసరమైతే ఇందుకోసం వ్యతిరేకులను అంతా ఏకం చేసే యోచనలో సైతం ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీలో టికెట్ కోసం ఇరువర్గాల నాయకులు చేస్తున్న ప్రయత్నాలు, వారి పట్టింపుల నడుమ చివరికి టికెట్ ఎవరికి దక్కుతుందోనన్న ఆసక్తి నెలకొంది. పార్టీ ఆదేశించిన విధంగా కొత్త, పాత నేతలు నడుచుకుంటారా.. అంతర్గత కుమ్ములాటలు ఎటువైపు దారితీస్తాయోనన్నది ఉత్కంఠగా మారింది.

అభివృద్ధిని చూసి ఆదరించండి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: తొమ్మిదేళ్ల స్వరాష్ట్ర పాలనలో అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తూ.. చేసిన అభివృద్ధిని చూసి, ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీడు భూములు కనిపించకుండా పంటలు సాగుచేసుకునేలా నీటి లభ్యతను కల్పించామని, విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు, పేదవారికి గురుకులం విద్యను చేరువలోకి తీసుకొచ్చామన్నారు. వనపర్తి జిల్లాగా అప్‌గ్రేడ్ చేయటంతోనే కలెక్టర్, ఎస్పీతో పాటు సుమారు 54 శాఖల జిల్లా అధికారులు ప్రజలకు అందుబాటులోకి వచ్చారన్నారు. తెలంగాణ వస్తే.. ఏమొస్తది అన్నవారికి సమాధానం చెప్పేలా సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని వెల్లడించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆసరా, వితంతు, దివ్యాంగుల పింఛన్లు, తెలంగాణ ప్రభుత్వ పథకం అందుకోని గడప రాష్ట్రంలో ఏ ఒక్కటి లేదన్నారు. గతంలో సేద్యం చేయాలంటే కరువు కాటకాలతో సాగునీరు లేక, కరంటు రాక చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఆ స్థితి నుంచి నేడు ఎకరా భూమి ఉన్న రైతు కూడా తన భూమిలోనే వ్యవసాయం చేసుకుంటూ ధీమాగా జీవిస్తున్నారన్నారు. అనంతరం పెబ్బేరు మండలం కంచిరావుపల్లికి చెందిన, శ్రీరంగాపూర్ తాటిపాములకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కార్యకర్తలతో పాటు జిల్లా కేంద్రంలో పనిచేసే పెయింటర్, ఫ్లోరింగ్, భవన నిర్మాణ కార్మికులు సుమారు రెండు వేల మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి మంత్రి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్‌ఎంపీలు సైతం పార్టీలో చేరారు.



కార్యక్రమానికి హాజరైనఆయా రంగాల కార్మికులు

కొల్లాపూర్‌లో కాంగ్రెస్ సభ వాయిదా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఈ నెల 20న జరగాల్సిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ బహిరంగ సభ వాయిదా పడినట్లు తెలిసింది. ఆయా తేదీల్లో పార్టీకి సంబంధించి ముఖ్య కార్యక్రమాలు ఉన్నందున కొల్లాపూర్ సభ వాయిదా పడినట్లు సమాచారం. దీంతో జోగుళాంబ గద్వాల జిల్లా చైర్‌పర్సన్ సరిత, సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, అలాగే మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 18న ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. అంతే కాకుండా ఈ నెల 20న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గద్వాల జిల్లాకు రానున్నట్లు పార్టీకి చెందిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగానే గద్వాలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది.

ప్రతిగడపకు కేంద్ర పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

పాన్‌గల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వివరించాలని నాగర్‌కర్నూల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. గడప, గడపకు బీజేపీ అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మల్లాయిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కొల్లాపూర్ నియోజకవర్గంలో చేసిన, చేసే అభివృద్ధి పథకాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ ప్రజలతో మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. అంతకు ముందు శాగాపూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన సుల్తాన్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అన్వేష్, జగన్‌గుప్తా, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఎస్‌జీఎఫ్'లో ముందడుగు

- మూడేళ్ల తర్వాత ప్రారంభం కానున్న క్రీడాపోటీలు
- షెడ్యూల్ విడుదల చేసిన తెలంగాణ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్
- నాలుగు దశల్లో క్రీడల నిర్వహణకు చర్యలు
- వచ్చేనెల మొదటి వారం నుంచి ప్రారంభం
- పాఠశాల, కళాశాల స్థాయిలో క్రీడల సందడి



మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణపై ముందడుగు పడింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్- 14, అండర్- 17, అండర్- 19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల స్థాయి మొదలుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తారు. అయితే ఈ పోటీల నిర్వహణపై కరోనా మహమ్మారి తీవ్ర ప్రభావం చూపింది. కరోనా వ్యాప్తితో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మూడేళ్ల నుంచి ఇటు ఎంపికలు కానీ, అటు టోర్నీలు కానీ నిర్వహించలేదు. దీంతో పాఠశాల, కళాశాల విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు.

నాలుగు దశల్లో..

ఈ ఏడాది జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమైనా ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణపై ఎలాంటి పురోగతి లేకపోవడంతో విద్యార్థులు ఆవేదనలో పడ్డారు. ప్రతి ఏడాది పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభం అనంతరం జిల్లాలోని పీఈటీలతో సమావేశం నిర్వహించిన తర్వాత ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల సెలక్షన్స్‌పై నిర్ణయం తీసుకుంటారు. ప్రతి ఏడాది జూలై, ఆగస్టులో జిల్లాస్థాయి సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయి తదనంతరం జాతీయ క్రీడల సెలక్షన్స్ నిర్వహిస్తారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇటీవలే రాష్ట్రంలోని పాఠశాలల, కళాశాలల క్రీడా పోటీలకు సంబంధించిన ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఆగస్టు మొదటి వారం నుంచి సెప్టెంబర్ నాలుగో వారంలో నాలుగు దశల్లో ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహిస్తారు. మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా (జోనల్), రాష్ట్రస్థాయిల్లో ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు జరగనున్నాయి. కొత్త జిల్లాల ఎంపిక పోటీలను నిర్వహించుకొని పాత జిల్లా జట్టుగా ఏర్పడి రాష్ట్ర పోటీలకు హాజరుకానున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా షెడ్యూల్ విడుదల కావడంతో ఇక పాఠశాల, కళాశాల స్థాయిల్లో క్రీడల సందడి నెలకొంది. ఎస్‌జీఎఫ్ క్రీడలకు కోసం మూడేళ్ల నుంచి విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల వివరాలు..

ఈవెంట్	క్రీడలు	నిర్వహించే తేదీ
1.	మండల స్థాయిలో టోర్నీలు	ఆగస్టు మొదటి, రెండోవారం
2.	జిల్లాస్థాయి టోర్నీ కం సెలక్షన్స్	ఆగస్టు మూడో వారం (అంతర్ మండలాలు)
3.	ఉమ్మడి (పాత) జిల్లాస్థాయి	సెప్టెంబర్ రెండో వారం టోర్నీ కం సెలక్షన్స్
4.	రాష్ట్రస్థాయి పోటీలు (పాత జిల్లాలస్థాయి)	సెప్టెంబర్ నాలుగో వారం



మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీ (ఫైల్)

పకడ్బందీగా నిర్వహిస్తాం..



ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు ఆగస్టులో ప్రారంభం కానున్నాయి. మండల, జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను పకడ్బందీగా నిర్వహిస్తాం. డీఈఓ ఆధ్వర్యంలో త్వరలో వ్యాయామ ఉపాధ్యాయులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించి జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్‌ను ప్రకటిస్తాం.
– రమేశ్‌బాబు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

భార్యపై కోపంతో హోంగార్డు ఆత్మహత్య

బిజినేపల్లి : భార్యపై కోపంతో హోంగార్డు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం గంగారంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు యాదవ్ కథనం మేరకు.. కొల్లాపూర్ మండలం ఎల్లూర్‌కు చెందిన మండ్ల శేఖర్ (39) హైదరాబాద్‌లోని సీఏఆర్ హెడ్ క్వాటర్స్‌లో హోంగార్డ్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తలకు కాపురంలో కొంతకాలంగా గొడవలు అవుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఇద్దరి మధ్య గొడవ కావడంతో శేఖర్ అలిగి ఇంటినుంచి వెళ్లిపోయాడు. తన వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగుల మందుతాగాడు. చుట్టుపక్కల వారు గమనించిన కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. శనివారం అక్కడి నుంచి శేఖర్ తప్పించుకుని పోయి గంగారం ఊరచెరువు వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు పోలీసులకు చెప్పడంతో అతని మొబైల్‌ను ట్రేస్ చేయగా ఘటనా స్థలం లోకేషన్ దొరికింది. వెంటనే పోలీసులు, కుటుంబసభ్యులు ఘటనా స్థలాని కి చెరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

పెబ్బేరు: ఒంటరిగా ఉన్న మహిళపై హత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం పేబ్బేర్‌లోని బీసీ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బున్యాదిపూర్‌కు చెందిన కావలి సంధ్య భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో సంవత్సరం ఆరునెలలుగా భర్తకు దూరంగా ఉంటోంది. పెబ్బేర్‌లోని బీసీ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని మిషన్ కుట్టుకుంటు జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో కొత్తకోట మండలం మిరాసిపల్లికి చెందిన కురుమన్న ఇంట్లోకి చొరబడి ఆమె గొంతుకు టవాల్ బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె గట్టిగా అరుస్తూ పక్కన ఉన్న మిషన్ కత్తెరతో అతనిపై దాడి చేసింది. ఈ క్రమంలో ఆమెకు చిన్నచిన్నగాయాలయ్యాయి. వెంటనే వెళ్లి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. చికిత్స కోసం ఆమెను ఆస్పత్రికి పంపించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ జగదీష్ తెలిపారు.

నూతన పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి



వనపర్తిటౌన్: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణకు నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ నెల 1 నుంచి పీఆర్సీ అమలు చేయాలని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పదోన్నతులపై విధించిన స్టేను ఎత్తివేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి 'మన ఊరు- మన బడి' ఎంతో దోహదపడుతుందన్నారు. దీంతో పాఠశాలలు అన్ని హంగులతో అభివృద్ధి చెందుతాయన్నారు. 'మన ఊరు- మన బడి'లో అన్ని పాఠశాలలు అభివృద్ధి చెందితే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌గౌడ్, వివిధ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కారు అద్దాలు ధ్వంసం


జడ్చర్ల: పట్టణంలోని 3వ వార్డులో నిలిపిన కారు అద్దాలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం కాలనీవాసులు విషయాన్ని గమనించి కారు యజమాని శ్రావణ్‌కుమార్‌కు తెలిపారు. కారు ముందు, వెనుక అద్దాలతో పాటు డోర్ అద్దాలను సైతం పెద్ద బండరాయితో ధ్వంసం చేశారు. సంఘటన స్థలంలో కారు పక్కనే మరో రెండు కార్లు ఉన్నా వాటి జోలికి వెళ్లలేదు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి విచారించారు. సీసీ పుటేజీల ఆధారంగా ధ్వంసం చేసిన వారిని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు.



కోయిల్‌సాగర్‌పై ఆశలు

- జూరాల నుంచి ఎత్తిపోతల ప్రారంభం
- 9.6 అడుగుల నుంచి 13.6 అడుగులకు చేరిన నీటి మట్టం
- 25 అడుగులు దాటితే సాగునీటి విడుదల

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టుపై రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. వానాకాలం ప్రారంభమై ఇప్పటికే నెల గడుస్తున్నా తగినంత వర్షాపాతం లేక వ్యవసాయ పనులు ప్రారంభించ లేదు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో పది రోజుల క్రితం 9.6 అడుగులకు నీటి మట్టం పడిపోయిన దశలో వానాకాలం పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కోయిల్‌సాగర్‌ను నింపాలనే ఉద్దేశంతో ఈ నెల 3వ తేదీన జూరాలలో నిల్వ ఉన్న నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా ఒక పంపును రన్ చేసి నేరుగా కోయిల్‌సాగర్‌కు తరలిస్తున్నారు. ఫేస్ వన్ ఉంద్యాల పంపుహౌస్ నుంచి ఒక పంపును రన్ చేసి అక్కడి నుంచి మరికల్ ఫేస్-2 నుంచి ఒక పంపు ద్వారా కోయిల్‌సాగర్‌కు నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం కోయిల్‌సాగర్ నీటిమట్టం పెరుగుతూ 13.6 అడుగులకు చేరింది. 0.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.6 అడుగులు 2.27 టీఎంసీల సామర్థ్యం, పాత అలుగు స్థాయి 26.6 అడుగులుగా ఉంది. ప్రాజెక్టులో 25 అడుగుల మేర ఒక టీఎంసీ నీటిమట్టం చేరితేనే కోయిల్‌సాగర్ కాల్వలను తెరిచే అవకాశం ఉంది.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు దృశ్యం



కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు మరికల్ పంప్ హౌస్ నుంచి ఒక పంపు ద్వారా వెళ్తున్న నీరు

రెండేళ్ల నుంచి..

రెండేళ్ల నుంచి కోయిల్‌సాగర్ నీటిని జూలై మూడో వారం నుంచే వానాకాలం పంటలకు విడుదల చేస్తూ వచ్చారు. గతంలో భారీ వర్షాలు కురవడం, ప్రాజెక్టులో నీటి మట్టం 20 అడుగుల పైనే ఉండడంతో నీటిని విడుదలకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. వానాకాలం అంతా నీటిని విడుదల చేయడంతో పంటల సాగు జోరుగా సాగింది. ఈ ఏడాది కూడా జూలై మూడో వారం వరకు నీటి మట్టం అనుకున్న స్థాయికి చేరితే కాల్వల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం పెద్ద వాగులో ప్రవాహం లేకపోవడంతో కేవలం ఎత్తిపోతల పథకం ద్వారానే వస్తున్న నీటితో కోయిల్‌సాగర్‌ను నింపాల్సి వస్తుంది.

సాగుకు ఇంకా సమయం..

వానాకాలం పంటల సాగుకు ఇంకా సమయం ఉండడంతో రైతులు నాట్లకు ముందే వ్యవసాయ పనులను చేసుకుంటున్నారు. బోరు బావుల కింద నారుమళ్లను వేసుకుంటున్నారు. భూములను చదును చేసి సాగుకు సిద్ధం చేస్తున్నారు. దేవరకద్ర, ధన్వాడ, మరికల్, చిన్నచింతకుంట మండలాల పరిధిలో పాత ఆయకట్టు 12 వేల ఎకరాలుగా ఉంది. కుడి కాల్వ కింద 9 వేల ఎకరాలు, ఎడమ కాల్వ కింద 3 వేల ఎకరాలుగా ఉంది. ఎత్తిపోతల లక్ష్యం 38,250 ఎకరాలు కాగా, పూర్తి సాగు 50,250 ఎకరాల లక్ష్యంగా ఉంది. ఎత్తిపోతల ప్రారంభమైన తర్వాత పూర్తి స్థాయి లక్ష్యం ఎప్పుడూ చేరలేదు. అయితే మూడేళ్లుగా అధికారికంగా కేవలం వానాకాలంలో 35 వేల ఎకరాల వరకు సాగు అవుతుంది. యాసంగిలో పాత ఆయకట్టుకే పరిమితమైంది. కాల్వలు, పిల్ల కాల్వల పరిస్థితి సక్రమంగా లేక పోవడంతో సాగు లక్ష్యం సాధ్యం కావడం లేదు.

తాగునీటి అవసరాలకు వాడుతున్నాం..

ప్రస్తుతం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నాం. కుడి కాల్వ వైపు ఒక మోటారు, ఎడమ కాల్వ వైపు ఒక మోటారు ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. ప్రాజెక్టులో కొంత మేర నీటి మట్టం పెరిగినా ప్రస్తుతం 0.5 టీఎంసీలుగా ఉంది. జూరాల నుంచి ఒక పంపు ద్వారా నీటిని ప్రాజెక్టుకు అందిస్తున్నాం. వర్షాలు బాగా కురిసి జూరాలకు ఇన్‌ఫ్లో వస్తే రెండు పంపులను రన్ చేసి నీటిని పంపింగ్ చేస్తాం. ప్రాజెక్టులో కనీసం ఒక టీఎంసీ నీటి మట్టం దాటితేనే సాగుకు వదిలే అవకాశం ఉంది. అప్పటి వరకు రైతులు వేచి ఉండాలి.

– ప్రతాప్‌సింగ్, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఈఈ

ఇంట్లో చోరీ

- బంగారు నగలు, నగదు అపహరణ



దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

అడ్డాకుల: ఇంటి తాళం బద్దలుకొట్టి ఇంట్లోని బంగారు నగలు, నగదు చోరీ చేసిన ఘటన ఆదివారం మూసాపేట మండలం జానంపేట గ్రామంలో చోటుచేసుకుంది. మూసాపేట ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసు రాంచంద్రయ్య, చంద్రకళ దంపతులు చౌరస్తాలో వస్త్ర విక్రయ దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి మహబూబ్‌నగర్‌లో ఉన్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం బద్దలుగొట్టి ఇంట్లో మంచం పరుపుకింద ఉన్న తాళాలతో బీరువా తీశారు. అందులో ఉన్న 12 తులాల నగలు, రూ.50వేల నగదును తీసుకెళ్లారు. ఆదివారం పొద్దున రాంచంద్రయ్య ఇళ్లు తెరుచుకుని ఉండడంతో ఇంటికి సమీపంలో ఉన్న నవీన్‌కుమార్ చూసి వారికి ఫోన్ చేశాడు. వెంటనే మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన రాంచంద్రయ్య తన ఇంట్లో దొంగతనం జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. భూత్పూర్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ విజయ భాస్కర్, క్లూస్‌టీంతో ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యానికి పసికందు బలి



రాస్తారోకో చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

నారాయణపేట : వైద్యుల నిర్లక్ష్యంతో ఓ గర్భిణీకి పురిటిలోనే పసికందు మృతి చెందిన ఘటన ఆదివారం నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు, గ్రామస్తులు వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పేటలోని వీరసావర్కర్ చౌరస్తాలో రెండుగంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని జాజాపూర్ చెందిన యాస్మిన్‌బేగం డెలివరీ కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఆ సమయంలో డాక్టర్ సౌజన్య చెకప్ చేసి నార్మల్ డెలివరీ అవుతుందని, కడుపులో బాబు నాలుగు కేజీల బరువుతో ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పింది. రాత్రి 8గంటలకు డ్యూటీలో డాక్టర్ శ్వేత, నర్సులైన సుజాత, అంజమ్మ ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో ఇద్దరు గర్భిణులకు డాక్టర్ పర్యవేక్షణ లేకుండానే నర్సులే సాధారణ కాన్పు చేశారు. ఆ సమయంలో యాస్మిన్‌బేగానికి పురిటి నొప్పులు రావడంతో 6.30గంటలకు ఇద్దరు నర్సులే డెలివరీ చేశారు. డాక్టర్ పర్యవేక్షణ లేకపోవడంతో డెలివరీ సమయంలో నర్సులు నిర్లక్ష్యంగా శిశువు తలను లాగారు. దీన్ని గమనించిన యాస్మిన్‌బేగం అక్క నర్సులను నిలదీస్తే ఆమెను బయటికి పంపేశారు. శిశువును డాక్టర్ శ్వేత దగ్గరకు నర్సులు తీసుకెళ్లి చూపించారు. అనుమానం రాకుండా పాతబస్టాండ్ దగ్గరున్న చిన్నపల్లల ఆస్పత్రికి తరలించారు. శిశువు ప్రాణంతో ఉన్నట్లు, చిన్నపిల్లల ఆస్పత్రికి వెళ్లినాకనే చనిపోయినట్లు నర్సులు నాటకం ఆడారు. బాబు కదలడం లేదని కుటుంబసభ్యులకు చెప్పడంతో అసలు విషయం బయటపడింది. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు వీరసావర్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టగా, జాజాపూర్ గ్రామస్తులు అక్కడి చేరి వారికి మద్దతుగా నిలిచారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి వెళ్లి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. సీఐ రవీందర్‌బాబు జిల్లా ఆస్పత్రి అధికారులకు ఫోన్ చేయడంతో ఆర్ఎంఓ డాక్టర్ పావణి, చిన్నపిల్లల డాక్టర్ క్రాంతి కిరణ్‌లు అక్కడికి చేరుకున్నారు. శిశువు మృతిపై వైద్యుల నిర్లక్ష్యం, సిబ్బంది తప్పు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ససెమీరా అన్నారు. ప్రసవ సమయంలో డ్యూటీ డాక్టర్ అక్కడ ఎందుకు లేరని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేణుగోపాల్ ప్రశ్నించారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్ ఆస్పత్రిలోనే ఉన్నారని చెప్పడంతో మరింత ఆందోళన చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్, నర్సులపై నివేదిక కలెక్టర్‌కు పంపి చర్యలు తీసుకుంటామని ఆర్ఎంఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధిత కుటుంబానికి ఆర్థికంగా సహకారం చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకిబంధు ఇవ్వాలి

- ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్



మాట్లాడుతున్న ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ మద్దిలేటి

అలంపూర్ : రాష్ట్ర ప్రభుత్వ బోయలకు వాల్మీకిబంధు ప్రవేశపెట్టాలని ఐక్య వాల్మీకి బోయల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ క్యాతూర్ మద్దిలేటి డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం నియోజకవర్గ ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలు సామాజికంగా, ఆర్థికంగా వెనకబాటుకు గురువుతున్నారన్నారు. రాజకీయ పార్టీలు బోయల ఓట్లు దండుకొని, ఆ తర్వాత మొండిచేయి చూపిస్తున్నారన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీలో చేర్చే బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. ఉమ్మడి జిల్లాలో వాల్మీకులు ఏకమై ఎస్టీ జాబితాలో చేర్చే వరకు ఉద్యమించాలన్నారు. సమావేశానికి ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ క్యాతూర్ మద్దిలేటి, శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, నారాయణ నాయుడు, జగన్‌మోహన్ నాయుడు, ధనుంజయ్, రామనాయుడు, ధర్మారం నాయుడు, రమణ బీసన్న, శ్రీనివాసులు, నరసింహ్ములు, శివన్న, పైపాడు శ్రీనివాసులు, నాగరాజు, జితేందర్, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

ఇరువర్గాల వాగ్వాదం

- ప్రభుత్వ స్థలంలో గుడిసెల తొలగింపుతో వివాదం

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నెలో ఆదివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ స్థలంపై కొద్దిరోజులుగా కొనసాగుతున్న వివాదం వేడెక్కింది. కొందరి స్వార్థంతో చేసిన పనికి గ్రామంలోని రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ వాతావరణాన్ని పెంచింది. వివరాల్లోకి వెళితే గ్రామంలోని సర్వే నంబర్‌లో 4లో ఉన్న మిగులు స్థలంపై కొన్ని రోజులుగా వివాదం నడుస్తుంది. స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయతి్నంచగా, అధికారులను ఫిర్యాదు చేసి కొందరు నిలిపేశారు. ప్రభుత్వ భవనాల కోసం ఆ స్థలాన్ని వాడాలని చెప్పినప్పటికీ కొందరు తమ పంతం నెగ్గించుకునేందుకు గ్రామంలోని ఒక సామాజిక వర్గానికి చెందిన వారితో హద్దులు ఏర్పాటు చేయించారు. ఆ విషయం సోషల్ మీడియాలో కూడా వచ్చినప్పటికీ అధికారులు స్పందించలేదు. దీంతో వారు తమ అనుచరులతో గుడిసెలు కూడా వేయించడంతో గ్రామంలోని మరో వర్గం వారు గుడిసెలను తొలగించారు. వివాదమున్న స్థలంలో, అది కూడా ప్రభుత్వ స్థలంలో గుడిసెలు ఎలా వేస్తారని నిలదీయడంతో మాటా మాటా పెరిగి, ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాల మధ్య ముదురుతున్న వివాదాన్ని తెలుసుకున్న ఎస్ఐ ఖాదర్ బాష సిబ్బందితో రంగప్రవేశం చేశారు. ప్రభుత్వ స్థలంలో వివాదం తగదని, సెలవు కావడంతో సోమవారం రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిద్దామని, అంతవరకు గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించడంతో వారు శాంతించారు.



ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాదర్

బైక్‌పై వెంబడించి పుస్తెలతాడు అపహరణ

జడ్చర్ల: మోటర్ బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపుకుని పారిపోయిన సంఘటన ఆదివారం రాత్రి జడ్చర్ల-గంగాపూర్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మిడ్జిల్ మండలం కొత్తపల్లి మాజీ సర్పంచ్ వెంకటయ్య, భార్య వెంకటమ్మతో కలిసి కొత్తపల్లి నుంచి జడ్చర్ల వైపు బైక్‌పై వస్తున్నారు. గంగాపూర్ శివారులో స్నేహ కోళ్ల దాణా పరిశ్రమ సమీపంలో వెనుక నుంచి ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి వెనుక కూర్చున్న వెంకటమ్మ మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కుని జడ్చర్ల వైపు పారిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేష్‌బాబు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వెంకటయ్య,వెంకటమ్మ

వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మదనాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని యువత వ్యవసాయ, వాటి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం హెడ్ దాదా సాహెబ్ సూచించారు. ఆదివారం కేవీకే మదనాపురంలో భారతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని యువకులకు అవగాహన కల్పించారు. కేవీకే కేంద్రాలు విస్తరణలో భాగంగా పనిచేస్తున్నాయని, కొత్త రకం వంగడాలు రైతుల క్షేత్రాల్లో క్షేత్ర పరీక్ష నిర్వహించి వాటి ఫలితాలను భారతీయ పరిశోధన స్థానం వారికి తెలియజేస్తామన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న యువత వ్యవసాయ ఉత్పత్తులపై నూతన వ్యవసాయ పద్ధతులపై దృష్టిసారించాలని సూచించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జీవన ఎరువులు, హైబ్రిడ్ కంది విత్తనాలు, వరి ఆముదం, చిరుధాన్యాలు ఉద్యాన ఉత్పత్తులపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేంద్రకుమార్, అనిత భవాని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు టికెట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కల్వకుర్తి రూరల్: పట్టణంలో ఆదివారం నిర్వహించిన గౌడ కులస్తుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60 చొప్పున సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, విజేందర్‌గౌడ్, బాలగౌడ్, ఫకీరయ్యగౌడ్, భాస్కర్‌గౌడ్, శంకర్‌గౌడ్, నాగార్జునగౌడ్, సురేందర్‌గౌడ్, రకుల్‌గౌడ్, సదానందంగౌడ్, ఆనంద్, గురువయ్య, వసంత, దుర్గయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

లూజ్ విత్తనాలతో జాగ్రత్త

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వానాకాలం సీజన్ ఆరంభమైంది. అన్నదాతలు సాగు పనులు మొదలు పెట్టారు. పంట సాగులో కీలక భూమిక పోషించే విత్తనాలను ఇప్పటికే కొంత మంది రైతులు కొనుగోలు చేశారు. మరి కొంతమంది వాతావరణ పరిస్థితులు దృష్ట్యా వేచి చూస్తున్నారు. వానాకాలం విత్తనాల కొనుగోలుకు రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ సూచించారు. దళారులు రైతులకు లూజ్ విత్తనాలు అమ్మి మోసం చేస్తారని హెచ్చరించారు. రైతులు లూజు విత్తనాల కంపెనీ(ప్యాకెట్ల)లో తేడాలు తెలుసుకోవాలన్నారు. ఈ విషయంలో అవగాహన ఉంటే పంటసాగు నుంచే నష్టాలను నివారించుకోవచ్చని వివరించారు.

దళారులు అమ్మే లూజ్ విత్తనాలు..

- ఈ విత్తనాలకు ఎటువంటి నాణ్యత ఉండదు.
- వీటి తయారీలో కంపెనీ నుంచి ధృవీకరణ, అధికారుల ప్రమేయం ఉండదు.
- లూజు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో ఎటువంటి బిల్లు ఇవ్వరు.
- ప్రాసెసింగ్, శుద్ధి ఇతర ప్రమాణాలుండవు
- ఈ విత్తనాలు విత్తాక పంట మధ్యలో పూత, కాత దశలో ఏమైనా నష్టాలు జరిగితే రైతులకు న్యాయం జరగదు
- ఈ విత్తనాలకు జన్యు నాణ్యత ఉండదు





నాణ్యత ప్రమాణాలు లేని లూజ్ విత్తనాలు

దళారులు రైతులను మోసం చేయడానికే లూజు విత్తనాలు విక్రయిస్తారు

కంపెనీ విత్తనాలు..

- ఈ విత్తనాలకు పూర్తి నాణ్యత ఉంటుంది
- ఈ విత్తనాల తయారీలో వివిధ దశల్లో కంపెనీ ధృవీకరణ, అధికారులు పాల్గొంటారు
- విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా బిల్లు ఇస్తారు
- విత్తన తయారీలో ప్రాసెసింగ్, శుద్ధి, ఇతర నాణ్యత ప్రామాణాలు తప్పక పాటిస్తారు
- ఈ విత్తనాలు కొనగోలు చేసినా రైతులకు పూర్తి న్యాయం జరుగుతుంది
- ఈ విత్తనాలకు ఖచ్చితంగా జన్యు నాణ్యత ఉంటుంది.



నాణ్యతగల ప్యాకుడు విత్తనాలు

వ్యవసాయ శాఖ వారితో లైసెన్స్ పొందిన డీలర్లు మాత్రమే విక్రయిస్తారు

- లైసెన్స్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి

లూజు విత్తనాలు విక్రయించడానికి వస్తే వారి సమాచారం వ్యవసాయ శాఖ అధికారులకు తెలపాలి. విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటిస్తే పంట సాగుకు ముందే జరిగే నష్టాలను రైతులు నివారించుకోవచ్చు.


ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి.

ఉరకలేస్తున్న గోదావరి



ధవళేశ్వరం: తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో బ్యారేజీ వద్దకు వచ్చి చేరుతున్న వరద నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 9.70 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 1,25,693 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. నీటిమట్టం ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద 14 అడుగులకు, పోలవరంలో 27.67 మీటర్లకు చేరింది.

బంగాళాఖాతంలో 18న మరో ఉపరితల ఆవర్తనం

సాక్షి, హైదరాబాద్: వాయువ్య బంగాళాఖాతంలో ఈ నెల 18న మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలోని ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్‌లో అల్పపీడనం ఏర్పడినట్లు చెప్పింది. రానున్న రెండు రోజుల్లో దక్షిణ వాయవ్య దిశలో ఝార్ఖండ్ మీదుగా కదిలే అవకాశం ఉన్నట్లు వివరించింది. దీంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది.

డ్రోన్ సాగు సూపర్!

▶ మొదటి పేజీ తరువాయి
సేకరించడానికి వీలుగా డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. డ్రోన్లను సరైన తీరులో వినియోగించడం ద్వారా.. సాగులో పురుగు మందులు, ఎరువుల వృథాను అరికట్టవచ్చని, కూలీల కొరతకు చెక్‌పెట్టవచ్చని వర్సిటీ అధికారులు చెప్తున్నారు.

వరిలో విత్తనాలు వెదజల్లేలా..
డ్రోన్ల ద్వారా వరి విత్తనాలను వెదజల్లి సాగు చేసే విధానాన్ని వ్యవసాయ వర్సిటీ అభివృద్ధి చేస్తోంది. దీనిపై పరిశోధన కొనసాగుతోందని, త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తామని వర్సిటీ అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం వరి నారు పెంచడానికి కొన్ని రోజులు పడుతుందని, తర్వాత నారు తీసి నాట్లు వేయడానికి సమయం పడుతుందని.. ఇదే సమయంలో కూలీల కొరత, ఖర్చు సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తే బాగుంటుందని, దీనికి డ్రోన్ సాంకేతికతను వినియోగించేలా పరిశోధన చేస్తున్నామని వివరించారు. డ్రోన్‌తో రోజుకు ఏకంగా 30 ఎకరాల్లో ఐదు వరుసల్లో వరి విత్తనాలను వెదజల్లవచ్చని చెప్తున్నారు. దీనివల్ల రైతులకు కూలీల ఖర్చు తగ్గుతుందని, సమయం కలిసివస్తుందని అంటున్నారు. కలుపు మందును కూడా డ్రోన్ల సాయంతో చల్లేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొంటున్నారు.

డ్రోన్లపై శిక్షణ కోసం అకాడమీ
రాష్ట్రంలో నిరుద్యోగులకు, ఆసక్తి కలిగిన వారికి డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని.. ఇందుకోసం డ్రోన్ అకాడమీని నెలకొల్పాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. త్వరలోనే దీనిని ప్రారంభిస్తామని.. వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర రంగాల్లో డ్రోన్లను ఎలా వాడాలో శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 60ఏళ్ల మధ్య వయసున్న వారికి శిక్షణ అవకాశం ఉంటుందని.. ఇందుకోసం తప్పనిసరిగా పాస్‌పోర్ట్ ఉండాలని, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వెల్లడించారు. ఆరు రోజులపాటు సమగ్రంగా శిక్షణ ఇచ్చేందుకు రూ.45 వేలు ఫీజు ఖరారు చేశారు. ప్రధానంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఉంటుంది.

పురుగు మందులు చల్లడంపై ప్రత్యేకంగా..
రాష్ట్రంలో ప్రధానంగా సాగు చేసే వరి, పత్తి, వేరుశనగ, కంది, పొద్దు తిరుగుడు, ఆముదం, సోయాబీన్ పంటల్లో డ్రోన్ల ద్వారా పురుగు మందులను చల్లడంపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని వ్యవసాయ వర్సిటీ వెల్లడించింది. దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించింది. ఉదాహరణకు డ్రోన్ల ద్వారా పురుగు మందు చల్లేటపుడు వాటి రెక్కల నుంచి వచ్చే గాలి వేగానికి వరి చేను విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఎంత ఎత్తు నుంచి డ్రోన్లను ఉపయోగించాలి, ఎంత స్థాయిలో మందును విడుదల చేయాలన్నది నిర్ణయించారు.

- ఇక సాధారణ తైవాన్ స్ప్రేయర్ల ద్వారా ఎకరా పంటకు పురుగుమందు పిచికారీ చేయాలంటే 150 లీటర్ల నుంచి 200 లీటర్ల నీటిని వాడుతారు. అదే డ్రోన్ల ద్వారా అయితే కేవలం 20 లీటర్లతో పిచికారీ చేయొచ్చు. ఒక రోజులో ఏకంగా 30 ఎకరాల్లో మందును చల్లవచ్చు. ప్రత్యేక పరికరాలను అమర్చడం ద్వారా.. కాండం మొదట్లోకి పురుగు మందు చేరేలా చేయవచ్చు.


పెద్దపల్లి జిల్లాలో క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

- కేంద్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తెచ్చిన నానో యూరియాను కూడా డ్రోన్ల ద్వారా పంటలపై చల్లవచ్చని వ్యవసాయ వర్సిటీ వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాంగోపాల్ వర్మ తెలిపారు. పురుగు మందులను తక్కువ వ్యవధిలో, పొదుపుగా, సమర్థవంతంగా చల్లడానికి డ్రోన్లతో వీలవుతుందని వివరించారు.

అదనపు పరికరాలను అమర్చి..
పంటలకు డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగు మందులు చల్లడానికి సంబంధించి అనేక అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఎందుకంటే కొన్ని పంటలకు పైపైన స్ప్రే చేస్తే సరిపోతుంది. మరికొన్నింటికి కాండం మొదట్లో చల్లాల్సి ఉంటుంది. దీనితో పాటు పంట పరిస్థితి ఏమిటి? ఏవైనా చీడపీడలు ఆశించాయా? అన్నది తెలుసుకునేందుకు ఫొటోలు తీయాలి. వాటిని వ్యవసాయాధికారికి పంపాలి. ఈ క్రమంలోనే ఆయా అవసరాలకు అనుగుణంగా డ్రోన్లకు ప్రత్యేక పరికరాలను అమర్చాలని అధికారులు భావిస్తున్నారు. ఇక పంటల పూత, కాత ఎలా ఉంది? దిగుబడి ఏమేరకు వచ్చే అవకాశం ఉంది వంటి ప్రతి అంశాన్ని సూక్ష్మస్థాయిలోనూ పర్యవేక్షించేలా డ్రోన్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్లు
రాబోయే రోజుల్లో గ్రామాల్లో సాగు కోసం డ్రోన్ల వినియోగం పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా.. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, దుక్కు దున్నే యంత్రాలు, వరి కోత యంత్రాలు వంటివి ఇవ్వగా.. భవిష్యత్తులో డ్రోన్లను అందజేసేందుకు వ్యవసాయ శాఖ సన్నాహాలు మొదలుపెట్టింది. ఒక్కో డ్రోన్ ధర రూ.10 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. వాటిని ఆగ్రోస్ సేవా కేంద్రాల నిర్వాహకులకు సబ్సిడీపై ఇవ్వాలని యోచిస్తున్నారు.

డ్రోన్ల సాగులో దేశానికే మార్గదర్శకంగా..

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికి సంబంధించి తెలంగాణ దేశానికే మార్గనిర్దేశం చేస్తోందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. వివిధ పంటల్లో డ్రోన్ల వినియోగం, నిర్వహణకు సంబంధించి జయశంకర్ యూనివర్సిటీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక (ఎస్‌ఓపీ)నే కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందని అంటున్నారు.

వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై సాధారణ మార్గదర్శకాలివీ..

- నీటి వనరులు, నివాస ప్రాంతాలు, పశుగ్రాసం పంటలు, ప్రజా వినియోగాలు, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ మొదలైన వాటికి దూరంగా డ్రోన్లను వినియోగించాలి.
- డ్రోన్ వాడకానికి సంబంధించి గ్రామ పంచాయతీ, వ్యవసాయ అధికారి కనీసం 24 గంటల ముందుగా అనుమతి ఇస్తారు.
- డ్రోన్ మంచి స్థితిలో ఉందని, సురక్షితంగా ప్రయాణించడానికి సరిపోతుందని ముందే సరిచూసుకోవాలి.
- దానితో పిచికారీ చేసే సమయంలో ఆయా ప్రాంతాల్లోకి జంతువులు, వ్యక్తులు ప్రవేశించకూడదు.
- ఆపరేటర్లు డ్రోన్ ఆపరేషన్, సురక్షితమైన పురుగు మందుల పిచికారీ.. ఈ రెండింటిపై శిక్షణ పొంది ఉండాలి.
- ముందుగానే ప్రతిపాదిత ప్రాంతం, సరిహద్దు, అడ్డంకులు (గోడలు, చెట్లు)ను పరిశీలించి ఆ ప్రకారం డ్రోన్‌ను ఆపరేట్ చేయాలి.
- ప్రభుత్వ సంస్థలు, సైనిక స్థావరాలపై లేదా డ్రోన్లకు అనుమతి లేని జోన్ల మీదుగా ఎగురవేయవద్దు. అనుమతి ఇవ్వని ప్రైవేట్ ఆస్తులపైనా డ్రోన్ ఎగరవేయవద్దు.

నిరుత్సాహపర్చిన బీసీలకు 'లక్ష' సాయం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం పంపిణీ పథకం ఆశావహులను తీవ్ర నిరాశకు గురిచేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద భారీగా దరఖాస్తులు రావడంతో వాటిని పరిశీలించి ప్రతి నెలా 15వ తేదీన విడతల వారీగా సాయం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా తొలివిడత కింద ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా ఆర్థిక సాయానికి ఎంపికైన వారికి చెక్కులు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు చేసిన యంత్రాంగం చివరకు అరకొరగా.. కేవలం పదుల సంఖ్యలోనే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. చాలా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పంపిణీ ఊసే లేకపోగా.. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చోట్ల పరిమితంగా లబ్ధిదారులకు చెక్కులు అందించడంతో ఎంతో ఆశగా సాయంకోసం ఎదురు చూసిన దరఖాస్తుదారులు నిరాశకు గురయ్యారు.

ఎంతమందికి అందాయి..?
బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం కింద రాష్ట్రవ్యాప్తంగా 5.28 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిని మండల స్థాయిలో పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో అధికారులు వీలైనన్ని దరఖాస్తులను పరిశీలించి జాబితాలను జిల్లా కలెక్టర్లకు అందించారు. తొలివిడత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ డబ్బుతో ప్రతి అసెంబ్లీ సెగ్మెంటుకు సగటున 335 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున సాయం ఆదించవచ్చని అంచనా వేశారు. కానీ శనివారం మెజార్టీ సెగ్మెంట్లలో ఈ కార్యక్రమమే నిర్వహించలేదని ఆరోపణలు వస్తున్నాయి. అయితే శాసనసభ్యులకు సమయాభావం వల్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేకపోయినట్లు క్షేత్రస్థాయి అధికారులు అధికారులు చెబుతున్నారు. దీంతో 15వ తేదీన జరిగిన కార్యక్రమంలో ఎంత మందికి చెక్కులు పంపిణీ చేశారనే దానిపై అస్పష్టత నెలకొంది. దీంతో మండలాల వారీగా సమాచారాన్ని సేకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తొలివిడతలో చేపట్టిన కార్యక్రమంలో పంపిణీ చేసిన చెక్కుల వివరాలపై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని చెపుతున్నారు.

తొలి విడతలో అరకొరగా సాగిన చెక్కుల పంపిణీ

- పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంపిణీ ఊసే లేదు
- రాష్ట్రవ్యాప్తంగా ఎంతమందికి పంపిణీ చేశారనేదానిపై అస్పష్టత
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందంటున్న అధికారులు



అత్యధికం అనర్హులే..!

వెనుకబడిన వర్గాల్లో కులవృత్తులపై ఆధారపడ్డ వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. దరఖాస్తులను ఆన్‌లైన్ పద్ధతిలో స్వీకరించింది. దరఖాస్తుల ప్రక్రియకు తక్కువ సమయం ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో అనూహ్య స్పందన వచ్చింది. అధికారులు వాటి పరిశీలనకు ప్రత్యేక విధానాన్ని అమలు చేసినట్లు తెలిసింది. ప్రతి దరఖాస్తుపై పూర్తిస్థాయి పరిశీలన (360 డిగ్రీలు) విధానంలో ఆరా తీసినట్లు చెపుతున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో మూడోవంతు వాటిని తొలివిడత కింద పరిశీలన చేశారు. ఇందులో మెజార్టీ అర్జీదారులు కులవృత్తులపైనే ఆధారపడకుండా ఇతరత్రా వ్యాపకాలు నిర్వహిస్తున్నట్లు వెలుగు చూసింది. అంతేకాకుండా ఆర్థికంగా బాగా ఉన్న వాళ్లు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడైంది. చాలా మందికి సొంతంగా నాలుగు చక్రాల వాహనాలు, ఇళ్లు, పొలాలు.. తదితరాలున్నా యని తేలింది. ఆదాయపన్ను చెల్లిస్తున్న వాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఈ క్రమంలో మెజార్టీ దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాల ఆధారంగా పరిశీలించిన దరఖాస్తుల్లోనూ ఇదే తరహాలో పలువురు అనర్హతకు గురైనట్లు తెలిసింది. దీంతో తాము సిఫార్సు చేసిన వారి పేర్లు లేనందున చెక్కుల పంపిణీ విషయంలో వారు ఆసక్తి చూపించలేదని తెలిసింది.

అంతిమ పోరాటానికి సిద్ధం కావాలి



మహబూబ్‌నగర్ రూరల్ : ఎస్సీ వర్గీకరణ ఆశయ సాధనలో అంతిమ పోరాటానికి మాదిగ సమాజం సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్‌మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బీజేపీ నేతలు ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాటలు చెబుతున్నారు తప్పా చేతల్లో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. పదేళ్లుగా బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టి పూర్తి మెజార్టీ ఉండి కూడా వర్గీకరణబిల్లు పార్లమెంట్‌లో పెట్టకపోవడం దారుణమన్నారు.
తక్షణమే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం ఆగస్టు చివరి వారంలో చలో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్, ఎస్సీ ఉపకులాల జాతీయ అధ్యక్షుడు నారాయణ, ఎంఈఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గాలి యాదయ్య, జిల్లా కన్వీనర్ టైగర్ రాజుమాదిగ పాల్గొన్నారు.

సంకల్ప యాత్ర విజయవంతం చేద్దాం

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ

అలంపూర్/ గద్వాల: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠంలో కొలువైన జోగుళాంబ అమ్మవారి ఆశీస్సులు బాలబ్రహ్మేశ్వర స్వామి వారి దీవెనలతో పాత పింఛన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేద్దామని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. అలంపూర్ క్షేత్రంలో పాత పింఛన్ సాధన సంకల్ప బస్సు యాత్రను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్, జిల్లా సంఘం నాయకులతో కలిసి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాత్రను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆశీస్సులతో అలంపూర్ క్షేత్రం నుంచి పాత పింఛన్ సాధన సంకల్ప యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 1.72లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సంకల్ప యాత్రలో భాగస్వాములు అవుతున్నట్లు చెప్పారు. 72 సంఘాల మద్దతుతో 33 జిల్లాలో యాత్ర కొనసాగుతుందన్నారు. జూలై 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 12వ తేదీన హైదరాబాద్‌లో సీపీఎస్ ఉద్యోగులు, కుటుంబాలతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఎస్ చిన్న విషయం కాదన్నారు. దేశంలో ఈ విధానంతో 84 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంకల్ప యాత్రతో ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయడానికి అడుగులు వేస్తోందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విష్ణు, శ్రీనివాస్, పవన్, మల్లికార్జున్, రాజేష్, వెంకటేష్, మహేష్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రతాప్, నారాయణ, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు. మొదటి రోజు యాత్ర గద్వాలకు చేరుకుంది. కార్యక్రమంలో శ్రీకాంత్ నరేష్‌గౌడ్, పవన్, నాగరాజ, బుచ్చన్న, రమేష్, లక్ష్మీనారాయణ ప్రతాప్, వెంకటనర్సమ్మ, రఘు తదితరులు పాల్గొన్నారు.


అలంపూర్‌లో జెండా ఊపి సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్

సంకల్ప యాత్రకు స్వాగతం..
అలంపూర్: సంకల్ప యాత్రకు ఉద్యోగ, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అలంపూర్ పుణ్య క్షేత్రంలో పాత పింఛన్ విధానం సాధన సంకల్ప యాత్ర ఆదివారం ప్రారంభమైంది. అలంపూర్ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్తున్న యాత్రకు నియోజకవర్గంలోని ఆయా మండలాల ఉద్యోగ, ఉపాధ్యాయులు అలంపూర్ చౌరస్తాలో స్వాగతం పలికారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం


సదస్సులో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరముందని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరిగంటి యాదయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, కిల్లెగోపాల్ ముఖ్య వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. జూలై 21 నుంచి ఆగస్టు 8 వరకు గ్రామ, మండల స్థాయి వరకు ప్రచారం నిర్వహించి బీజేపీ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులతో విస్తృతంగా చర్చించాలన్నారు. ఆగస్టు 9, 10వ తేదీల్లో జిల్లా కేంద్రాల్లో మహాధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం బరితెగించి కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుందన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగ ఉత్పత్తులకు సబ్సిడీలు ఎత్తివేసిందని, విద్యారంగానికి 6 శాతం, వైద్యరంగానికి 2 శాతం మాత్రమే కేటాయించి ప్రజల డిమాండ్‌ను బేఖాతరు చేస్తుందన్నారు. సమావేశంలో కురుమూర్తి, సాంబశివుడు, రామ్మోహన్, రాములుయాదవ్, రాజ్‌కుమార్, దేవదానం, దీప్లా, సురేశ్, తిరుపతయ్య, భాగ్యలక్ష్మి, చెన్నయ్య, లలిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

బాలానగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఒకసారి అవకాశం ఇచ్చి చూడాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాలుగడ్డ తండాలో ప్రారంభమైన ప్రజాహిత పాదయాత్ర నేరేళ్లపల్లి, గుండేడ్, బాలానగర్, అమ్మపల్లి మీదుగా సాగింది. ఈ సందర్భంగా బాలానగర్ మండల కేంద్రంలో భారీ గజమాలతో అభిమానులు ఆయనకు స్వాగతం పాలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఊర్లలో ఎక్కడ చూసినా ప్రజలు సంతోషంగా లేరని వారికి అందాల్సిన పింఛన్లు, రైతు రుణమాఫీ, ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు లేక ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందని ఎదురు చూస్తున్నారన్నారు. సమస్యలను ఎత్తిచూపేందుకే పాదయాత్ర చేపట్టానని అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు దివంగత నాయకుడు వెంకటలక్ష్మారెడ్డి 4 ఎకరాల భూమి ఇస్తే, ఇప్పుడు రెండు ఎకరాలు కూడా లేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు కబ్జాలకు, ఆక్రమణలకు గురవుతుంటే తహసీల్దార్, కలెక్టర్ ఏం చేస్తున్నారని సభలో ప్రశ్నించారు. నేరేళ్లపల్లి మీదుగా దొండ్లపల్లి వరకు బీటీ రోడ్డు కోసం మధ్యలో ఉన్న ఓ వెంచర్ వద్ద రూ.2 కోట్లు తీసుకున్నారని అలాంటప్పుడు ప్రభుత్వ డబ్బులు ఎందుకు ఖర్చు చేశారని ప్రశ్నించారు. అది నిజం కాకపోతే వెంచర్ యాజమాన్యం గుడిలోని ఆంజనేయస్వామిపై ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. రంగారెడ్డిగూడలో పొల్యూషన్ బిలాస్‌రాయ్ పరిశ్రమను మూయించడానికి రూ.70 లక్షలు ఖర్చు చేసుకున్నానని, ప్రస్తుతం ఎలాంటి పొల్యూషన్ లేదని ప్రభుత్వం తిరిగి అనుమతి ఇచ్చిందన్నారు. ఇలాంటి దొంగలు రాష్ట్రంలో రాజ్యం ఏలితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎవరినైనా సరే చెప్పుతో కొట్టండని పిలుపునిచ్చారు. ఆయన వెంట శంకర్‌నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మయ్య, బద్రునాయక్, వెంకట్ నాయక్, సోమ్లానాయక్, రాఘవేందర్, గణేష్‌గౌడ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాహిత పాదయాత్రలో మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

మంత్రిని కలిసిన నల్లమల చెంచులు

మన్ననూర్: పోడు భూముల పట్టాల పంపిణీలో అన్యాయం జరిగిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తో నల్లమల చెంచులు మొరపెట్టుకున్నారు. ఆదివారం నల్లమల ప్రాంతం పుల్లాయిపల్లి, బైరాపూర్, కొల్లం, కొమ్మెనపెంట, బీకే ఉప్పునుంతల, గానుగుపెంట, పల్లెరూటిపెంట, మద్దిమడుగు గ్రామాలకు చెందిన సుమారు 56 మంది చెంచు రైతులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెంచులు తమకు జరిగిన అన్యాయం, సమస్యలపై మంత్రికి వివరించారు. 40 ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్నామని, అర్హులైన మాకు కాకుండా జీవనోపాధి కోసం నగరాలకు వలస పోయిన వారికి, పోడు భూముల సాగులో లేని వారికి పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. పదర మండలం పల్లెరూటిపెంటలో 60 కుటుంబాల వారు పోడు భూములను సాగు చేస్తుండగా, 20 కుటుంబాల వారికి మాత్రమే పట్టాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు మరొకరి పేర భూమి పట్టా ఇచ్చారని తెలిపారు. తక్షణమే గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యవేక్షణలో విచారణ చేసి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు నారాయణ, బాలయ్య, అంబయ్య, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.


మంత్రి సత్యవతి రాథోడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నల్లమల చెంచులు

నడిగడ్డలో కాంగ్రెస్ ప్రజాగర్జన


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈనెల 20న కాంగ్రెస్ పార్టీ ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ఆయన సమక్షంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ పార్టీల నుంచి వచ్చిన పలువురు ప్రముఖ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు రుజువుచేస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం మానుకుంటానని, బీఆర్‌ఎస్ నాయకులు రుజువు చేయకుంటే వారు ఎన్నికల్లో పోటీ చేయరాదని సవాల్ విసిరారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ప్రజాగర్జన సభకు అలంపూర్ నియోజకవర్గం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో షేక్షావలి ఆచారి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెంచులకు నాటుకోళ్ల పెంపకంపై శిక్షణ

దోమలపెంట: నల్లమలలోని అప్పాపూర్, భౌరాపూర్‌లో నివసిస్తున్న చెంచులకు నాటుకోళ్ల పెంపకంపై రెండు రోజులు శిక్షణ తదుపరి కోడి పిల్లలు ఇస్తున్నట్లు మిరాకిల్ ఎన్జీఓ నిర్వాహకుడు జావేద్ ఆదివారం తెలిపారు. గవర్నర్ తమిళిసై నల్లమలలో పర్యటించిన తర్వాత అప్పాపూర్, భౌరాపూర్ చెంచు పెంటలను దత్తత తీసుకున్నారని, ఇందులో భాగంగా త్వరలో 50 చెంచు కుటుంబాలకు శిక్షణ ఇచ్చి ఒక్కో కుటుంబానికి 20 కోడి పిల్లలు, మూడు నెలల దాణా ఇస్తామన్నారు. ఫలితంగా చెంచులకు జీవన ఉపాధి మెరుగుపడుతుందన్నారు.

దత్తత చెంచు గ్రామాలకు ఆర్థికసాయం..
మన్ననూర్: నాబార్డు 42వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై దత్తత తీసుకున్న నల్లమల అటవీ లోతట్టు చెంచు గ్రామాలైన అప్పాపూర్, భౌరాపూర్ అభివృద్ధికి కోసం నాబార్డు వారు మంజూరు చేసిన నిధుల చెక్కును గ్రామాలకు చెందిన ప్రతినిధులకు అందజేశారు. చెంచులకు ఆదాయ వనరుకై చింతపండు సేకరణ యూనిట్ కోసం అదనపు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధితో పాటు ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా గవర్నర్ చెంచులకు సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీడీఎం షణ్ముకాచారీ, నాగర్‌కర్నూల్ డీడీఎం అఖిల్‌పున్నా, ఎన్జీఓ బృందం పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులకు చెక్కులు అందజేస్తున్న గవర్నర్ తమిళిసై